ప్రజాశక్తి

గురువారం 15 ఫిబ్రవరి 2024

కలెక్టర్‌గా విజయ సునీత

ప్రజాశక్తి పాడేరు: అల్లూరి జిల్లా నూతన కలెక్టర్ గా విజయ సునీతను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2014 ఐఎఎస్ బ్యాచ్‌కు చెందిన ఆమె సివిల్ సప్లయిస్ డైరెక్టర్‌గా ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్నారు. బదిలీపై అల్లూరి జిల్లా కలెక్టర్‌గా నియమితులయ్యారు. అల్లూరి జిల్లా కలెక్టర్ గా పని చేసిన సుమిత్ కుమార్‌ను ప్రభుత్వం పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేసింది. సుమిత్ కుమార్‌నుగత రెండేళ్లుగా అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ గా పని చేశారు.

జలజీవన్ పనులపై దుమారం

- ఇళ్ల పట్టాల్లో అక్రమాలపై మండిపాటు
- జెడ్‌పి సమావేశంలో సభ్యులు ధ్వజం
- తాగునీటి సరఫరా సరిగా లేదని ఛైర్‌పర్సన్ సుభద్ర అసంతృప్తి
- వైద్య సేవలు మెరుగుపర్చాలి : సిపిఎం జెడ్‌పిటిసి గంగరాజు

సభ్యులను వారిస్తున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్ సుభద్ర, అధికారులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

జల జీవన్ మిషన్ (జెజెఎం) నిధులతో చేపట్టిన తాగునీటి సరఫరా పనులు నిరుపయోగంగా ఉన్నాయని పలువురు జెడ్‌పిటిసిలు ధ్వజమెత్తారు. పనులు జరిగిన గ్రామాల్లో నీరు సరిగా ప్రజలకు ఇవ్వలేని పరిస్థితి ఉందని అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం జెడ్‌పి ఛైర్‌పర్సన్ అధ్యక్షతన జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో జలజీవన్ మిషన్ పనులపై చర్చ వాడివేడిగా సాగింది. ఏజెన్సీ, మైదాన ప్రాంతంలో జెజెఎం నిధులతో చేపట్టిన మంచినీటి పథకాలెక్కడా సరిగా పనిచేయడంలేదని ఛైర్‌పర్సన్ సుభద్ర అన్నారు. పనులు సక్రమంగా జరగలేదని అసంతృప్తి వ్యక్తంచేశారు. ఏజెన్సీలో ఎంతోకాలం కిందట ఏర్పాటు చేసిన గ్రావెటీ వాటర్ స్కీం పనిచేసినట్లు కొత్తగా నిర్మించిన జెజెఎం మంచినీటి పథకాలు పనిచేయడంలేదన్నారు. చింతపల్లి మండల కేంద్రంలో నీరు రావడంలేదని జెడ్‌పిటిసి బాలయ్య పోతురాజు, బోర్లకు హెడ్స్ బిగించలేదని హుకుంపేట జెడ్‌పిటిసి మత్స్య లింగం, కుళాయిలకు లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని రాంబిల్లి జెడ్‌పిటిసి ధూలి నాగరాజు అన్నారు. సోలార్ వాటర్ స్కీం పనులు మరమ్మతులకు గురయ్యాయని గొలుగొండ జెడ్‌పిటిసి సుర్ల వెంకటగిరిబాబు తెలిపారు

పేదలకు ఇచ్చిన ఇళ్ల పట్టాల్లో అనేక అక్రమాలు జరిగాయని బుచ్చెయ్యపేట జెడ్‌పిటిసి దొండా రాంబాబు అన్నారు. అక్రమాలు, పట్టాల అమ్మకాలపై విజిలెన్స్ విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇళ్ల పట్టాలు పొందిన అనర్హుల జాబితా అధికారులకు సమర్పించినా ఇంతవరకు చర్యలు తీసుకోలేదని గొలుగొండ జెడ్‌పిటిసి వెంకటగిరిబాబు తెలిపారు. ఇళ్ల పట్టాల అక్రమాలపై చర్యలు తీసుకోవడంలో అధికారుల అశ్రద్ధపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానమివ్వడంలేదంటూ గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ రమామణి తీరును తప్పుబట్టారు. సభ్యుల ఆవేదన అర్థంచేసుకోకుండా పీడీ మాట్లాడ్డం సరికాదని పరవాడ జెడ్‌పిటిసి పైలా సన్యాసిరాజు అన్నారు. పరవాడ మండలంలో కొండల నుంచి చెరువులకు వచ్చే ఛానల్స్ ఆక్రమణలను తొలగించాలని కోరారు.

సమస్యలను లేవనెత్తుతున్న సిపిఎం జెడ్‌పిటిసి గంగరాజు

సమస్యలపై గళమెత్తిన గంగరాజు

అనంతగిరి సిపిఎం జెడ్‌పిటిసి డి.గంగరాజు మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలు సంపూర్ణంగా అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. రోగులను ఎస్.కోట నుంచి విజయనగరం కాకుండా, విశాఖపట్నం తరలించేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. 24 గంటల పిహెచ్‌సిల్లో వైద్యులు వుండేలా చూడాలన్నారు. ఆస్పత్రి అభివృద్ధి నిధులు దుర్వినియోగం జరుగుతున్నాయని తెలిపారు. సిహెచ్‌డబ్ల్యులను ఆశా వర్కర్లుగా మార్చడంతో పాటు, ఖాళీలను భర్తీచేయాలన్నారు. ఎన్‌టిఆర్ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం చేయడానికి వైద్యులు, సిబ్బంది డబ్బులు వసూలుచేస్తున్నారని మునగపాక జెడ్‌పిటిసి పెంటకోట సోమ సత్యనారాయణ తెలిపారు. మండలంలో అందరికీ కళ్లద్దాలు అందలేదని పరవాడ జెడ్‌పిటిసి సన్యాసిరాజు అన్నారు. ఛైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం ప్రకారం 21 శాతం సీట్లు పేద పిల్లలకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జిల్లా పరిషత్ సిఇఒ పోలినాయుడు, అనకాపల్లి డిఆర్‌ఒ దయానిధి, వివిధ శాఖాధికారులు, జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు పాల్గొన్నారు.

కోరంలేక ఆలస్యం

జిల్లా పరిషత్ సమావేశానికి సభ్యులు సకాలంలో హాజరుకాకపోవడంతో కోరంలేక ఆలస్యంగా ప్రారంభించారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభంకావాల్సిన సమావేశం, కోరంలేక 11.12 గంటల వరకు జరగలేదు. ఈలోపు సిఇఒ పోలినాయుడు 15వ ఆర్థిక సంఘం నిధులతో జరుగుతున్న పనుల వివరాలు తెలిపారు. సమావేశానికి ముందు మాజీ ముఖ్యమంత్రి కీర్తిశేషులు దామోదరం సంజీవయ్య 103వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి జెడ్‌పి ఛైర్‌పర్సన్ సుభద్ర పూలమాలవేసి నివాళులర్పించారు. సిఇఒ పోలినాయుడు, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామారావు, జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని మంజూరు చేయరూ..

కొండిపకోటలో చిన్నారులు, గర్భిణుల విజ్ఞప్తి

ప్రజాశక్తి- అనంతగిరి: మండలంలోని పెద్దకోట పంచాయతీ కొండిపకోట గ్రామంలో అంగన్వాడి కేంద్రం లేక పోవడంతో చిన్నాలు, గర్భిణులకు పౌష్టికాహారం అందక అవస్థలు పడుతున్నారు. గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం లేక పోవడంతో గెడ్డవాగు దాటి కిలోమీటరు దూరంలో ఉన్న తముటు అంగన్వాడి కేంద్రానికి ప్రతిరోజు కాలి నడకన వెళ్లలేని పరిస్థితి నెలకొంటుంది. దీంతో, ఇటు చిన్నారులు, అటు బాలింతలు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొండిబకోట గ్రామంలో 25 మందికి పైగా గర్భిణీలు, బాలింతలు, పది మంది పిల్లులు ఉన్నారు. అయినా ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాన్ని మంజూరు చేయలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి అంగన్వాడి కార్యకర్తను నియమించాలని పిల్లల తల్లిదండ్రులు, గర్భిణీలు, బాలింతలు కోరుతున్నారు.

గ్రామంలో ఉన్న చిన్నారులు

ప్రాక్టికల్ పరీక్షలను పర్యవేక్షిస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి

పకడ్బందీగా ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ జనరల్, ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఇంటర్ ఎడ్యుకేషన్ జిల్లా అధికారి కె అప్పల రాము అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలను బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ప్రాక్టికల్స్ జరుగుతున్న తీరు, సౌకర్యాలు, సీసీ కెమెరాల ఏర్పాటు, వాటి పనితీరు తదితర వాటిని పర్యవేక్షించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట కళాశాల ప్రిన్సిపల్ ఆర్ శిరీష సిబ్బంది ఉన్నారు.

సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

పలు భవనాలు ప్రారంభం

ప్రజాశక్తి-విఆర్ పురం

మండలంలోని రాజుపేట, సచివాలయం, ఆసుపత్రి భవనాలను, రేఖపల్లి సచివాలయ భవనాన్ని రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి బుధవారం ప్రారంభించారు. ఎంపీపీ కారం లక్ష్మి, జెడ్పిటిసి వాళ్ళ రంగారెడ్డి,. స్థానిక సర్పంచ్ పూనం సరోజిని, పలువురు ప్రజా ప్రతినిధులు ఆయా కార్యాలయాలలో ఆఫీస్ రూములను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట్లాడుతూ అభివృద్ధిలో తమ ప్రభుత్వం ఎప్పుడు ముందే ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, పంకు సత్తిబాబు, లక్ష్మణరావు, చోడి మల్లయ్య, సత్యనారాయణ, హజరత్, వైసిపి నాయకులు మాదిరెడ్డి, సత్తిబాబు, చిక్కాల బాలు, ప్రజా ప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న రైతు కూలీ సంఘం నాయకులు, గిరిజనులు

పోడు భూములకు పట్టాలివ్వాలని ర్యాలీ

ప్రజాశక్తి-రంపచోడవరం

కొండ పోడు భూములకు పట్టాలివ్వాలని కోరుతూ అఖిలభారత రైతుకూలీ సంఘం ఆధ్వర్యాన స్థానిక మార్క్స్, ఏంగెల్స్ భవనం నుండి మెయిన్ రోడ్డు మీదగా నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం కేంద్ర కమిటీ సభ్యులు పి.టాన్యా మాట్లాడుతూ కొండపోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, దేవాదాయ ధర్మాదాయ భూములు నిరుపేదలకు ఇవ్వాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు పూర్తిగా అమలు చేసి చిన్న సన్న కారు, కౌలు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీలో 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు పరచాలని, అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఆదివాసీ చట్టాలను పరిరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వి చిట్టిబాబు, ప్రధాన కార్యదర్శి బాలయ్య, నాయకులు కె.లక్ష్మి, కే బాలు రెడ్డి, ఐ రమణ, పిఓడబ్ల్యు జిల్లా కార్యదర్శి పి అనసూయ, సిపిఐఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి సిహెచ్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇది రైతు రాజ్యం కాదు.. అదానీ రాజ్యం

ప్రజాశక్తి -కొయ్యూరు

కేంద్రంలో పాలన సాగిస్తున్నది రైతు ప్రభుత్వం కాదని, అదానీ ప్రభుత్వమని కాంగ్రెస్ నాయకులు ఎస్.అశోక్‌లాల్ బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఢిల్లీలో శాంతియుతంగా నిరసన చేస్తున్న రైతులను చూసి బిజెపి ఎందుకు భయపడుతుందని ప్రశ్నించారు. రైతు పండించే పంటకు రైతు ధర నిర్ణయించకుండా అదానీ సంస్థలు కొనుగోలు చేసి వారే రేటును నిర్ణయిస్తారని చెప్పడం అన్యాయమన్నారు. ఈ దేశానికి అన్నం పెట్టే రైతన్న గిట్టుబాటు ధర లేక అప్పుల బాధలతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస మద్దతు ధర కల్పించకుండా రైతులకు నష్టం చేకూర్చే నల్ల చట్టాలను తీసుకొచ్చిందని, ఆ చట్టాలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఏడాది పాటు ఢిల్లీలో జరిగిన రైతుల పోరాటం సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఢిల్లీ చలోకి రైతులు బయలుదేరితే అడుగు అడుగునా బారిగెట్లు, రోడ్లపై మేకులు పెట్టీ పోలీస్ బలగాలతో అడ్డుకోవడం దారుణమన్నారు.

సిబ్బందిని సన్మానిస్తున్న సిఐ

ముగిసిన రోడ్డు భద్రత మాసోత్సవాలు

- ఉత్తమ సిబ్బందికి అవార్డుల ప్రదానం

ప్రజాశక్తి-పాడేరు: రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా స్థానిక పాడేరు డిపో, ఏపీఎస్ ఆర్టీసీ, అల్లూరి సీతారామరాజు జిల్లా డిపో గ్యారేజీలో ముగింపు సభ బుధవారం నిర్వహించారు. డిపోలో డ్రైవర్లు, కండక్టర్లు, మెకానికల్ స్టాఫ్, ఆఫీస్ సిబ్బంది, యూనియన్ ప్రతినిధులు, సూపర్వైజర్లు, సెక్యూరిటీ సిబ్బంది సుమారుగా 80 మంది పాల్గొన్నారు. డిపో మేనేజర్ వేదుల శ్రీనివాసు ఆధ్వర్యాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్ మాట్లాడుతూ, డ్రైవర్లు అప్రమత్తంగా ఉండిప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానంకు చేర్చాలని తెలిపారు. హిట్ అండ్ రన్ కేసులలో డ్రైవర్ నిర్లక్ష్యం నిరూపించబడితే 8 సంవత్సరాలు జైలు శిక్ష, ఆపైన జరిమానా కూడా ఉంటుందని తెలిపారు. సర్కిల్ ఇన్స్పెక్టర్ నవీన్ కుమార్ చేతుల మీదుగా యాక్సిడెంట్ ఫ్రీ డ్రైవర్స్ కె. కొండబాబు,వి. చిన్నారావు, శ్రీనివాసరావులను సన్మానించి అవార్డులను ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో ఆఫీస్ ఇంచార్జ్ డివి శ్రీనివాసు, ట్రాఫిక్ ఇంచార్జ్ డి. అప్పారావు, గ్యారేజీ మెకానికల్ ఇంజనీర్ వి.రమణ, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రచారం చేపడుతున్న కాంగ్రెస్ నేతలు

రంగిలిసింగిలో కాంగ్రెస్ ప్రచారం

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కుమారిని గెలిపించాలని ఆ పార్టీ నాయకులు బుధవారం ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంతోనే గిరిజన ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కిల్లో జగన్నాథం చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కే.రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

17న అనంతగిరి మండల సమావేశం

ప్రజాశక్తి -అనంతగిరి: మండల సర్వసభ్య సమావేశం ఈనెల 17న శనివారం నిర్వహించడం జరుగుతుందని మండల పరిషత్ అధికారి హర్షిత్ రాజ్యం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 17న ఉదయం 10:30 గంటలకు ప్రారంభం అవుతుందని, అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు విధిగా హాజరు కావాలన్నారు. గత సమావేశంలో సభ్యులు లేవనెత్తిన పలు సమస్యలపై రికార్డులతో హాజరు కావాలని కోరారు.

జోరుగా గంజాయి రవాణా

- పెట్టుబడులు పెట్టి మన్యంలో గంజాయి సాగు చేయిస్తున్న స్మగ్లర్లు
- పలు మార్గాల్లో అక్రమంగా తరలింపు
- పట్టుబడి జైళ్లలో మగ్గుతున్న యువత

గంజాయి తోటలను తొలగిస్తున్న పోలీసులు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-చింతూరు

అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు డివిజన్ మీదుగా వందల కోట్ల రూపాయల విలువైన గంజాయి తెలంగాణ, మహారాష్ట్ర, ప్రాంతాలకు అక్రమంగా రవాణా జరుగుతోంది. ఇలా రవాణా జరుగుతున్న గంజాయి అనేక సందర్భాల్లో ఖమ్మం, కొత్తగూడెం, హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో పట్టుబడుతుంది. ఏవోబిలోని మన్యం ప్రాంతాలను అడ్డాగా చేసుకొని కొందరు దళారులు పెట్టుబడులు పెట్టి గంజాయి సాగును చేయిస్తున్నారు. సీలేరు, చిత్రకొండ, బచ్చులోరు, ఒరిస్సా సరిహద్దు ప్రాంతాల్లోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో గంజాయి సాగు విచ్చలవిడిగా సాగుతోంది. గతంలో జిల్లా పోలీసు ఉన్నతాధికారులు గంజాయి నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించి పెద్ద మొత్తంలో గంజాయి పంటలను ధ్వంసం చేశారు. కొంతకాలం స్తబ్ధతగా ఉన్నా, మళ్లీ గంజాయి సాగు ఊపందుకుంది.

గంజాయి రవాణా కూడా పెద్ద మొత్తంలో సాగుతోంది. గంజాయి అక్రమ రవాణా సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ దానిని అరికట్టే ప్రయత్నాలు పోలీసులు చేస్తున్నా స్మగ్లర్లు రకరకాల పద్ధతుల్లో గంజాయిని ఇతర రాష్ట్రాలకు తరలిస్తూనే ఉన్నారు. కంటైనర్లు, ఖరీదైన కార్లు, అనుమానం రాకుండా అంబులెన్సులు, స్టూడెంట్ తరహాలో బైకులు, యాత్రికుల వలె బస్సులు ఇలా అనేక రకాలుగా గంజాయిని రవాణా చేస్తున్నారు. ఇలా అక్రమ రవాణా చేస్తూ పట్టుపడ్డ ఘటనలు అనేకం ఉన్నాయి. గతంలో ఒక్క నెలలోనే కోట్ల రూపాయలు విలువ చేసే కంటైనర్లు చింతూరు మండల కేంద్రంలో పోలీసులు పట్టుకున్నారు. చింతూరు, మోతుగూడెం పోలీస్ స్టేషన్ల ఆవరణలో గంజాయితో పట్టుబడిన వాహనాలు వందల సంఖ్యలో ఉన్నాయి.

యువత, విద్యార్థులు గంజాయి దుర్వ్యసనాలకు లోను కావద్దని పోలీసులు అనేక ర్యాలీలు, పరివర్తన కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించడం, పట్టుబడిన వారికి కౌన్సిలింగ్ ఇవ్వడం వంటివి చేస్తున్నారు. అయినా కూడా ఈజీ మనీకి అలవాటు పడి గంజాయి స్మగ్లర్ల ప్రలోభాలకు లోనవుతూ బైకులపై, బ్యాగుల్లో గంజాయిని తరలిస్తున్నారు. దేశానికి వెన్నెముకగా ఉండాల్సిన యువత గంజాయి కేసులో పట్టుబడి జైల్లో మగ్గుతోంది. దీంతో వారి కుటుంబాలు కుదేలువుతున్నాయి. ఇటువంటి సమయంలో యువత మేల్కొని చైతన్యవంతులై గంజాయి వ్యసనానికి, రవాణా దూరంగా ఉండాల్సిన అవసరం ఉంది.

వీధి కుక్కల దాడిలో జింక పిల్లకు గాయాలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

జింక పిల్లకు చికిత్స అందిస్తున్న దృశ్యం

మండలంలోని అప్పల రాజుపేట గ్రామంలోని బుధవారం వీధి కుక్కలు దాడి చేయడంతో చుక్కలజింక పిల్ల తీవ్రంగా గాయపడింది. రాజవొమ్మంగి పంచాయతీ అప్పలరాజుపేట సమీప అటవీ ప్రాంతం నుండి దారితప్పి మూడు నెలల వయసు ఉన్న చుక్కల జింక పిల్ల గ్రామంలోకి రావడంతో వీధి కుక్కలు దానిపై దాడి చేశాయి. వాటి నుండి జింక పిల్ల తప్పించుకొని భయంతో సమీప ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలోకి ప్రవేశించింది. దీనిని చూసిన విద్యార్థులు ఆనందంతో గెంతులు వేశారు. జింకను స్థానికులు పరిశీలించగా ఒంటిపై తీవ్ర గాయం ఉండడంతో అటవీ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఎఫ్ఎస్ఓ రాము ఆధ్వర్యంలో పశు వైద్య సిబ్బంది అక్కడికి చేరుకొని చుక్కల జింకకు ప్రథమ చికిత్స చేశారు. జింక పిల్ల కోలుకునే వరకు తమ పర్యవేక్షణలో ఉంచి గాయాలు నయమైన వెంటనే అటవీ ప్రాంతంలో విడిచిపెట్టడం జరుగుతుందని ఫారెస్ట్ సెక్షన్ అధికారి రాము తెలిపారు.

మా గ్రామాలకు రోడ్లు వేయండి

ప్రజాశక్తి -కొయ్యూరు

కొయ్యూరు మండలం, బూదరాళ్ళ పంచాయతీ పరిధిలోని మారుమూల గ్రామాలకు కనీస రోడ్డు సౌకార్యం లేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే రోడ్లు వేయాలని గరిమండ గ్రామానికి చెందిన కుర్ర రమణబాబు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గరిమండ, అన్నవరం, పిట్టలపాడు, వంతమర్రి, కనుకూరు, కన్నవారం, నల్లబెల్లి, బొడ్డుమామిడి, బి.కొత్త వీధి, రాజులపాడు, పోకలపాలెం, పోతవరం, గోదుమలంక, చీడిపల్లి, సల్దిగెడ్డ, కొర్రాపాడు, కిండంగి, దొడవవాక, తూములోవ, సూదులపాడు, టిండిరాయి, నూకరాయితోట, నేరళ్లబంధ తదితర గ్రామాలకు రోడ్ల సౌకార్యం లేదని తెలిపారు. గతంలో రోడ్లు నిర్మిస్తామని నాటి ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ కొంత మేరకు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టగా, వాటిని అర్ధాంతరంగా నిలిపివేశారని పేర్కొన్నారు. దీనిపై ప్రస్తుత పిఒ అభిషేక్ పునరాలోచన చేసి తక్షణమే రోడ్లు వేయాలని కోరారు.

అంగన్వాడీ కేంద్రాలకు సరుకులు చేర్చాలి

ప్రజాశక్తి -సీలేరు

సరుకులు మోసుకొస్తున్న అంగన్వాడీ కార్యకర్త

సరుకులను నేడు అంగన్వాడీ కేంద్రాలకు అందజేయవలసిన గుత్తేదారులు ఇష్టారాజ్యం వ్యవహరిస్తూ అంగన్వాడీ కార్యకర్తలతో మోయిస్తున్నారని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకులు బాకూరు కోటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జికె.వీధి మండలం నరమామిడి గొంది, ధర్మపురం, దార్లగొంది, నిమ్మ చెట్టు, ధారాపురం, కొండ జర్త, రాళ్లగడ్డ అంగన్వాడీ కేంద్రాలకు కోడిగుడ్లు సరఫరా చేస్తున్న గుర్తేదారుడు రహదారి సౌకర్యం ఉన్న వాటిని ఆయా కేంద్రాలకు చేర్చడం లేదని తెలిపారు. దీంతో అంగన్వాడి వర్కర్లు వాటిని మోసుకొని తీసుకెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వెట్టిచాకిరీ చేయించుకుంటున్న గుత్తేదారుడుపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై గూడెం కొత్త వీధి సిడిపిఓ సెక్టార్ సూపర్వైజర్లు చర్యలు తీసుకోకపోవడం వల్ల అంగన్వాడీ కార్యకర్తలు తీవ్ర మనోవేదన గురవుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి సౌకర్యం ఉన్న గ్రామాలకు గుడ్లు, పాలు, బాల సంజీవని వంటివి నేరుగా అంగన్వాడీ కేంద్రాలకు అందే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

ఏజెన్సీలో వైద్యంపై నిర్లక్ష్యం

-టిడిపి అధికార ప్రతినిధి సుబ్బారావు

ప్రచారం చేపడుతున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి -పాడేరు : గ్రామీణ ప్రాంతాల్లోని గిరిజన హరిజన పేద ప్రజలకు వైద్య సేవల కల్పనలో వైసిపి ప్రభుత్వం తీవ్ర అలక్ష్యం చేసిందని టిడిపి ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి కొట్టగొడలి సుబ్బారావు విమర్శించారు. వర్తనాపల్లి గ్రామంలో బుధవారం శంఖారావాన్ని పూరించారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి గెలిపించాలని కోరారు. మాజీ మంత్రి మణి కుమారి మాట్లాడుతూ, పేరుకే జిల్లా ఆసుపత్రిగా ప్రకటించి కనీస వైద్య సౌకర్యాలు లేవన్నారు. విశాఖపట్నం లోని కెజిహెచ్‌కి రోగలను రిఫర్ చేస్తే అక్కడ పట్టించుకునే నాథుడే లేడన్నారు. 104, 108, వ్యవస్థను పూర్తిగా అస్తవ్యస్తంగా తయారు చేశారని ఫీడర్ అంబులెన్స్ వ్యవస్థని పూర్తిగా నిర్వీర్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే గిరిజనుల, దళితుల పట్ల ప్రత్యేక వైద్య సేవలు అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. సూపర్ సిక్స్ పథకాలపై కొట్టగుల్లి సుబ్బారావు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాడేరు మాజీ సర్పంచ్ వర్తన పిన్నయ్య దొర, టిడిపి నాయకులు డప్పోడి అప్పలస్వామి, సరమండ తిరుపతి, రేమల నాగరాజు, డప్పోడి భవాని, సరమండ లక్ష్మమ్మ పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో 'పది' పరీక్షలు రాయాలి

సమావేశం లో మాట్లాడుతున్న కమిషన్ చైర్మన్ అప్పారావు

ప్రజాశక్తి - ఆరిలోవ : విద్యార్థులు ఆత్మస్థైర్యంతో పదో తరగతి పరీక్షలు ఎదుర్కోవాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు, కమిషన్ సభ్యులు గొండు సీతారాం పిలుపునిచ్చారు. శ్రీకృష్ణాపురంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రాంగణంలో ఐసిడిఎస్, ఐసిపిఎస్, బాలల హక్కుల కమిషన్ సంయుక్త ఆధ్వర్యాన 'ఆందోళన వద్దు .. ప్రశాంతతో పరీక్షలు ముద్దు' పేరిట అవగాహన సదస్సును ప్రారంభించిన వీరు మాట్లాడుతూ, ర్యాంకులు, గ్రేడింగ్‌ల వేటలో విద్యార్థులు ఒత్తిడికి లోనై అభద్రతాభావంతో ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు ఉత్పన్నమౌతున్నాయని, వాటిని అధిగమించేందుకు మానసిక నిపుణులు, మేథావులతో విద్యార్థులకు అవగాహనకు బాలల హక్కుల కమిషన్ సదస్సులను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తోందన్నారు. ప్రముఖ సైకాలజిస్టులు,డాక్టర్ గంగాధర్, జి.రాజేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల ఒత్తిడిని దూరం చేసేందుకు తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు వారితో కొంత సమయం వెచ్చించాలన్నారు. చిన్న లక్ష్యాలను ముందుగా నిర్దేశించుకుని వాటిని సాధించడం ద్వారా విద్యార్థుల్లో మానసికస్థైర్యాన్ని పెంపొందింపజేసి, అంచెలంచెలుగా ఉన్నత లక్ష్యాల వైపు సాగితే విజయం వరిస్తుందన్నారు. గురుకులాల జిల్లా కోఆర్డినేటర్ ఎస్.రూపవతి మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలు, సూచనలతో విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపి పది పరీక్షలకు సన్నద్ధులను చేస్తున్నామన్నారు. జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్‌పర్సన్ ఎంఆర్‌ఎల్.రాధ, చైల్డ్ డెవలప్‌మెంట్ పీవో రమణ కుమారి, ప్రిన్సిపల్ రత్నవల్లి, పాల్గొన్నారు.

మూడేళ్లుగా..

ముందుకు సాగని పనులు

ఇదీ తహశీల్దార్ కార్యాలయ భవనం దుస్థితి

ప్రజాశక్తి - దుంబ్రిగుడ: మండలంలోని గిరిజనుల సౌకర్యార్థం మండల కేంద్రంలో నిర్మిస్తున్న నూతన తహసిల్దార్ కార్యాలయం భవనం నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంతో అసంపూర్తిగా దర్శనమిస్తుంది. ఇక్కడి తహసిల్దార్ కార్యాలయానికి సంబంధించి సొంత భవనం లేక పోవడంతో గత నాలుగేళ్ల క్రితం ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో అప్పట్లో పనులు ప్రారంభించారు. ఈ భవనం నిర్మాణ పనులు రెండు అంతస్థులు వరకు శ్లాబ్ దశ వరకు వేసి ప్లాస్టిక్ చేయకుండా వదిలేశారు. ఆ పనులకు సంబంధించి పూర్తిస్థాయిలో బిల్లులు చెల్లించక పోవడంతో ఇప్పటివరకు పనులు పూర్తి కాలేదు. ఈ భవనం నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచి పోయి సుమారు మూడేళ్లు గడుస్తుంది. అయినా పనులు పూర్తి కాలేదు.తహసిల్దార్ కార్యాలయానికి సొంత భవనం లేక పోవడంతో ఫారెస్ట్ శాఖకు చెందిన భవనంలో కార్యకలాపాలు నిర్వహణ సాగిస్తున్నారు. అక్కడ సిబ్బందికి పూర్తి స్థాయిలో భవన సౌకర్యం లేక నిర్వహణకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పలువురు సిబ్బంది అంటున్నారు.

అసంపూర్తిగా ఉన్న తహశీల్దార్ కార్యాలయ భవనం

పస్తుతం ప్రధానంగా ఉన్నతాధికారులతో మండల స్థాయి అధికారులకు నెలకు మూడు, నాలుగు సార్లు టెలీ కాన్ఫరెన్స్ లేక వీడియో కాన్ఫరెన్స్ కచ్చితంగా జరుగుతుంది. దీంతో, తహాసిల్దార్ కార్యాలయంలో ఉద్యోగులకు సరిపడే సమావేశ భవనం లేక పోవడంతో కొంత మంది ఉద్యోగులు బయట నిల్చోవలసిన పరిస్థితి ఏర్పడుతుంది.నూతనంగా నిర్మిస్తున్న కార్యాలయ భవనం పూర్తిగా నిర్మిస్తే రెవెన్యూ సిబ్బందితో పాటు మండల ఉద్యోగులకు కూడా సమావేశాలు జరుపుకోవడానికి ఉపయోగకరంగా ఉంటుంది.తక్షణమే ఉన్నత స్థాయి అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న తహసిల్దార్ కార్యాల భవనాన్ని పూర్తిగా నిర్మించాలని పలువురు సిబ్బంది కోరుతున్నారు.

ఇళ్ల స్థలాలకు పేదల భూపోరాటం

సిపిఎం ఆధ్వర్యంలో ప్రభుత్వ స్థలంలో జెండాలు పాతిన పేదలు

ఆటస్థలం చదును చేసేందుకు వచ్చిన పేదలు

ప్రజాశక్తి- పెందుర్తి : పేదల ఇళ్లస్థలాల కోసం పెందుర్తి కార్మికనగర్‌లో బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో రెండో రోజు భూపోరాటాన్ని కొనసాగించారు. మంగళవారం సుమారు 100 మంది పేదలు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకుని పాకలు వేయగా, బుధవారం అక్కడ ఆటస్థలానికి కొంత భూమిని చదును చేశారు.

ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గసభ్యులు బి..జగన్ మాట్లాడుతూ, పేదలకు ఇళ్లస్థలాలను ఇవ్వాలని పెందుర్తి తహశీల్దార్‌ను మరోమారు కలిసి విన్నవించామన్నారు. 2019నుంచి అధికారులు, నేతలు చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ, ఇళ్లస్థలాలకు భూమిని కేటాయించాలని పదేపదే మొరపెట్టుకుంటున్నా, కనీస స్పందన లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో పేదలంతా ప్రత్యక్ష కార్యాచరణకు దిగి, ఎర్రజెండాలను స్థలాన్ని ఆక్రమించుకుని పాకలు వేశారని, ఇపుడు అక్కడ కాలనీవాసుల పిల్లల ఆటస్థలానికి కొంత భూమిని చదును చేశారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికార యంత్రాంగం, నేతలు స్పందించాలని, పేదల ఆవాసానికి ఆక్రమించిన స్థలాల్లో పట్టాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. చినముషిడివాడ జంక్షన్‌లో 95వ వార్డు కార్పొరేటర్ విలువైన వెయ్యి గజాల స్థలాన్ని ఆక్రమిస్తే దానివైపు కన్నెత్తి చూడని అధికారులు, పేదలు ఆవాసానికి అరవై గజాల చోటులో పాకవేస్తే ఆగమేఘాల మీద వచ్చి కూల్చేస్తున్న వివక్షపూరిత చర్యలు దారుణమన్నారు. కార్యక్రమంలో సిఐటియు జోన్ సభ్యులు శంకరరావు అప్పలనాయుడు, విజయమ్మ, వాసు ఈశ్వరరావు, అన్నపూర్ణ, లక్ష్మి, మహేష్, రాజు పాల్గొన్నారు

10 లీటర్ల సారా స్వాధీనం

పట్టుబడిన నిందితుడితో పోలీసులు

ప్రజాశక్తి -జి.మాడుగుల: మండలంలో ఉరుము జంక్షన్ వద్ద మంగళవారం స్థానిక పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా సారాతో నడిచి వస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా గాంధీనగర్‌కు చెందిన బాలు అనే వ్యక్తిగా గుర్తించారు. అతడి వద్ద నుంచి పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని నిందితునిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు స్థానిక ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. సారా అమ్మకాలు జరిపే వారిపై ప్రత్యేక నిఘా సారించామని, దొరికితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు

పిఇటి పోస్టులు లేకపోవడం అన్యాయం

ప్రజాశక్తి -తగరపువలస : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన డిఎస్‌సి నోటిఫికేషన్‌లో పిఇటి పోస్టులు లేకపోవడం అన్యాయమనిపలువురు నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ బుధవారం ఎండాడలోని పార్టీ కార్యాలయంలో జనసేన నియోజకవర్గ ఇంఛార్జి పంచకర్ల సందీప్‌కు వినతి పత్రం అందజేశారు. 2024 డిఎస్‌సి నోటిఫికేషన్‌లో యుజిడి, పిఇటి, డిపిఇడి పూర్తి చేసిన వారికి దరఖాస్తు పెట్టేందుకు అర్హత లేకపోవడం బాధాకరమన్నారు. ఇలాంటి ప్రభుత్వ విధానాలతో కొన్ని వేల కుటుంబాలు రోడ్డునపడ్డాయని వాపోయారు. పిఇటి పోస్టులను పరిగణనలోకి తీసుకోకుండా ప్రభుత్వం వివక్ష ధోరణితో నోటిఫికేషన్ జారీ చేసిందని అవేదన వ్యక్తం చేశారు. దీనిపై సందీప్ స్పందిస్తూ, సమస్యను జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. జనసేన నాయకులు శాఖరి శ్రీను బాబు, నందిక రోహిత్ రెడ్డి పాల్గొన్నారు

జ్యూట్ కార్మికుల బకాయి చెల్లించాలి

ప్రజాశక్తి- తగరపువలస : చిట్టివలస జ్యూట్‌మిల్లు కార్మికులకు బకాయి చెల్లించాలని పలు కార్మిక సంఘాల ప్రతినిధులు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కాకాస కార్యాలయంలో కాకాస, చిట్టివలస లేబర్ యూనియన్, టిఎన్‌టియుసి జ్యూట్ నాయకులు పాల్గొని పలు సమస్యలపై చర్చించారు. కార్మికుల బకాయి చెల్లించకుండా ఇక్కడున్న భూములను అమ్మేందుకు యాజమాన్యం యత్నిస్తే అడ్డుకుంటామని ఆయా సంఘాల నాయకులు యాజమాన్యాన్ని హెచ్చరించారు. కోర్టు పరిధిలో పలు కేసులు ఉన్నందున భూముల అమ్మకాలు చట్ట విరుద్ధమన్నారు. సమావేశంలో జెవి కైలాస్‌రెడ్డి, దల్లి అప్పలరెడ్డి, అల్లు బాబూరావు, కొండపు ఈశ్వరరావు, ఎంవి గురుమూర్తి, ఎన్ రామారావు పాల్గొన్నారు

మాస్టర్ రిసోర్స్‌పర్సన్స్‌కు అభినందన

ప్రజాశకి- ములగాడ : రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో గుంటూరు కెఎల్. యూనివర్సిటీలో ఈనెల 12,13వ తేదీల్లో అభ్యసనాభివృద్ధిపై మాస్టర్ రిసోర్స్‌పర్సన్స్ శిక్షణలో పాల్గొన్న సెయింట్ ఆన్స్ కళాశాల ఎన్‌సిసి జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇపిఎస్. భాగ్యలక్ష్మి, సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయాదేవిలను బుధవారం కళాశాల యాజమాన్యం అభినందించింది. అలాగే పంజాబ్, రాజపురాలోని చిత్కార యూనివర్సిటీలో నిర్వహించిన జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొన్న ఎన్‌సిసి వాలంటీర్ జి.హర్షితారాణిని కూడా అభినందించారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, వచ్చే నెలలోవివిధ ప్రభుత్వ పాఠశాలల్లో వాలంటీర్లతో లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్‌లను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సెయింట్ ఆన్స్ కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా, సిస్టర్స్ జయశీల, జానిస్ పాల్గొన్నారు.

పుస్తకాన్ని అందజేస్తున్న లక్ష్మీనారాయణ

ఇఇ లక్ష్మీనారాయణకు అభినందనలు

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సీలేరు జల విద్యుత్ కేంద్రంలోని నాలుగో యూనిట్ ఆధునీకీకరణకు సంబంధించి ఎపి జెన్‌కో సీలేరు జలవిద్యుత్ కేంద్రం ఇఇ లక్ష్మీనారాయణ రాసిన పుస్తకాన్ని ఏపీ జెన్కో హైడల్ డైరెక్టర్ (సీజీఎం) ఎం. గౌరీపతి, హైడల్ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ సుజయ్ కుమార్‌కు విజయవాడ విద్యుత్ సౌధాలో అందజేశారు. దీంతో లక్ష్మీనారాయణను వారు అభినందించారు. రెండో యూనిట్ ఆధునీకీకరణ పనులు కూడా పూర్తి చేస్తే బాగుంటుందని వారు సూచన చేసినట్లు ఇఇ లక్ష్మీనారాయణ తెలిపారు.

సచివాలయ భవనాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - మారేడుమిల్లి: దేవీపట్నం మండలంలోని కొండమొదలు, తున్నూరు గ్రామపంచాయతీలకు కొత్త సచివాలయం, రైతు భరోసా కేంద్రాల భవనాలు మంజూరు చేయాలని ఆదివాసి జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కొండమొదలు, తున్నూరు గ్రామపంచాయతీల పరిధిలో మొత్తం 18 గ్రామాలు ఉన్నాయన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కారణంగా సర్వం కోల్పోయిన ఆదివాసీ కుటుంబాలు ప్రభుత్వం నిర్మించిన ఆర్అండ్ఆర్ కాలనీలకు వచ్చి స్థిర నివాసం ఏర్పరుచుకున్న గ్రామాలు కూడా ఇందులో కొన్ని ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కొండ మొదలు, తున్నూరు గ్రామపంచాయతీలకు కలిపి తాత్కాలికంగా సచివాలయం ఆర్అండ్ఆర్ కాలనీ పెద్ద పెంపెల్లి 3లో ఏర్పాటు చేశారన్నారు. పాత గ్రామాల్లో ఉన్న ప్రజలు ప్రస్తుతం తాత్కాలంగా ఏర్పాటు చేసిన సచివాలయానికి రావాలంటే సుమారు 58 కిలోమీటర్లు ఎన్నో ఇబ్బందులు పడుతూ ప్రయాణించాల్సి వస్తోందని పేర్కొన్నారు. కావున ఈ గ్రామాలకు కొత్త సచివాలయం, రైతు భరోసాకేంద్రం, విలేజ్ క్లినిక్ వంటివి మంజూరు చేయాలని కోరారు.

బోడిదొరకు కెజిహెచ్‌లో మెరుగైన వైద్య సేవలు

ప్రజాశక్తి-కొయ్యూరు : స్వాతంత్ర్య సమరయోధుడు, అల్లూరి సీతారామరాజు ముఖ్య అనుచరుడు గాం గంటం దొర మనవడు బోడిదొర ఆరోగ్యం క్షీణించడంతో ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఆదేశాల మేరకు విశాఖపట్నం కేజీహెచ్ చేర్చి వైద్య సేవలు అందిస్తున్నట్లు జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు తెలిపారు. బుధవారం కాకరపాడు విచ్చేసిన ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మంగళవారం బోడిదొరను కెజిహెచ్‌లోని రాజేంద్రప్రసాద్ వార్డులో ఎఎంసిఐఐ బ్లాక్ వరండాలోకి నెట్టివేయగా, తమ సంఘం కార్యదర్శి శివంగి నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యుడు పోతిన వెంకటేశ్వరరావు తదితర ప్రతినిధుల బృందం ఆసుపత్రి వర్గాలతో మాట్లాడడంతో పాటు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారని చెప్పారు. దీంతో బోడిదొరను గదిలో చేర్చి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. దేశం కోసం ప్రాణాలర్పించిన వారి కుటుంబాలపట్ల ఇలా వ్యవహరించడం సరికాదన్నారు. బోడిదొర కోలుకునే వరకు మెరుగైన వైద్యం అందించాలని, అప్పటివరకు ఆయన కుటుంబ పోషణకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. ఆయన వెంట సంఘం కార్యదర్శులు శ్యామల వరలక్ష్మి, అంబటి వరహాల రాజు, కార్యవర్గ సభ్యులు మాకాడ బూరుగులయ్య, కోన సత్యనారాయణ ఉన్నారు.

విద్యాశాఖ డివైఇఒను రిలీవ్ చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : జివిఎంసి విద్యాశాఖలో అనధికారికంగా కొనసాగుతున్న డివైఇఒ డి.శ్రీనివాస్‌ను తక్షణం రిలీవ్ చేయాలని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మకు వినతి పత్రం సమర్పించారు.

ఎయులో రూ.5 కోట్లతో..

ఆహార పరీక్ష ప్రయోగశాల ప్రారంభం

ప్రయోగశాల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ హరి వెంకట కుమారి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్రా యూనివర్సిటీ కెమిస్ట్రీ విభాగంలో రూ.5 కోట్లతో ఏర్పాటు చేసిన ఆహార పరీక్ష, ప్రమాణీకరణ ప్రయోగశాలను నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, శాసన మండలి సభ్యులు వరుదు కల్యాణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున బుధవారం ప్రారంభించారు. విశాఖపట్నంలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సులో జరిగిన ఒప్పందాల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా రెండు వ్యవసాయ ఉత్పత్తి కేంద్రాల ప్రారంభోత్సవంతో పాటు వివిధ పరిశ్రమలకు శంకుస్థాపన కార్యక్రమం బుధవారం ఉదయం జరిగింది. ఈ కార్యక్రమానికి తాడేపల్లి నుంచి రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, నెల్లూరు నుంచి రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, ఫుడ్ ప్రోసెసింగ్ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి వర్చువల్‌గా హాజరై ప్రారంభించారు. విశాఖ జిల్లాలో ఎపిఎఫ్‌పిఎస్ (ఎపి ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ) నిధులు రూ.5 కోట్లతో ఆరు వేల అడుగుల విస్తీర్ణంలో ఎయు కెమిస్ట్రీ విభాగంలో ఏర్పాటు చేసిన ఫుడ్ ప్రోసెసింగ్ అండ్ స్టాండర్డైజేషన్ లేబొరేటరీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి ముఖ్య అతిథిగా హాజరై శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ప్రయోగశాలను శాసన మండలి సభ్యులు వరుదు కళ్యాణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఆహార నాణ్యత పరీక్ష సౌకర్యాన్ని అందించే అత్యాధునిక ప్రయోగశాల ఇదని ఎయు వీసీ ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాద్ రెడ్డి మంత్రులకు వివరించారు. విద్యా, వాణిజ్య ప్రయోజనాల కోసం ఈ ప్రయోగశాల ఉపయోగించబడుతుందని తెలిపారు. కల్తీ సరుకులతో ప్రజల ఆరోగ్యం దెబ్బ తింటుందని, ఈ ప్రయోగశాల ద్వారా సరుకుల నాణ్యత ప్రమాణాలను తెలుసుకోవచ్చని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్ట్‌కు ఎపిఎఫ్‌పిఎస్ రూ.5 కోట్లు, జిల్లా కలెక్టర్ రూ.2 కోట్లు సిఎస్ఆర్ నిధులను మంజూరు చేస్తున్నట్లు మంత్రులకు వివరించారు. కార్యక్రమంలో ఎయు రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, సైన్స్, టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీనివాసరావు, ఫార్మసీ కాలేజ్ ప్రిన్సిపాల్ వై.రాజేంద్రప్రసాద్, ఆర్ అండ్ డి డీన్ ప్రొఫెసర్ కె.బసవయ్య, వివిధ విభాగాల ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దశల వారీ ఆందోళనలో భాగంగా బుధవారం ప్రభుత్వ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఆర్‌డిఒకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎపి జెఎసి జిల్లా చైర్మన్ వై.నారాయణరావు మాట్లాడుతూ ప్రభుత్వంతో జరిగిన చర్చలు విఫలం కావడంతో ఎపి జెఎసి రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు ముందుగా ప్రకటించిన విధంగా ప్రభుత్వ ఉద్యోగులంతా వివిధ నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలోని ఎన్జీవోస్ హోమ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 16న పాఠశాలల వద్ద నిరసన ప్రదర్శనలు ఉంటాయన్నారు. 17న ర్యాలీలు, ధర్నాలు నిర్వహిస్తామన్నారు. 20న కలెక్టరేట్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని వెల్లడించారు. 21 నుంచి 24 వరకు రాష్ట్ర నాయకులు జిల్లాల పర్యటనలు నిర్వహిస్తారని తెలిపారు. 27న చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడతామని చెప్పారు. అప్పటికీ ప్రభుత్వం దిగి రాకపోతే సమ్మెకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి జెఎసి విశాఖ జిల్లా కన్వీనర్ ఆర్.రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ పలువురు ఉద్యోగులు బుధవారం నల్లబ్యా డ్జీలు ధరించి ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం ఆర్‌డిఒ ఎస్ భాస్కరరెడి, తహసీల్దార్ టి గోవింద్‌కు ఉద్యోగ జెఎసి ప్రతినిధులు వినతిపత్రాలు అందజేశారు కార్యక్రమంలో ఎపి ఎన్‌జిఒ భీమిలి తాలూకా యూనిట్ సహాధ్యక్షులు ఎం లోవరాజు, కార్యదర్శి కె సాయిబాబా, జిల్లా కౌన్సిలర్ వి అప్పలరాజు, పెన్షనర్ల సంఘం అధ్యక్షులు టి భీమారావు, కార్యదర్శి ఎం.ఆనందరావు పాల్గొన్నారు

మోడీ తొత్తులతో పోరాటం : కెఎ.పాల్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలోని మోడీ తొత్తులతో తాను పోరాటం చేస్తానని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కెఎ.పాల్ అన్నారు. ఆయన దక్షిణ నియోజకవర్గ పరిధిలోని రైల్వే న్యూ కాలనీలోగల పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి బొత్సకు తెలుగులో మాట్లాడం రాదుగానీ లక్ష కోట్లు దోచుకోవడం వచ్చునని ఎద్దేవా చేశారు. జగన్ తన తల్లిని, చెల్లిని మోసం చేశారన్నారు. షర్మిల 16 నెలల పాదయాత్రతోనే జగన్ అధికారం పొందారన్నారు. పిసిసి అధ్యక్ష పదవి తీసుకున్న షర్మిల టిడిపి విజయానికి దోహదం చేస్తున్నారన్నారు. తాను ప్రతి నెలా 50 వేల మంది మహిళలకు ఆర్థిక సాయం చేస్తున్నాన్నారు. విశాఖలో భూములు, కొండలను నేతలు దోచుకున్నారని మండిపడ్డారు. తాను స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకుంటానని, నాలుగు వేల కోట్ల నిధులు తెస్తానని అన్నారు.

నిందితులతో పోలీసులు

ద్విచక్ర వాహన చోరీ నిందితుల అరెస్టు

ప్రజాశక్తి - సీలేరు : ఆంధ్ర ఒరిస్సా రాష్ట్రాల్లో బైక్ చోరీలకు పాల్పడుతున్న నలుగురు యువకులను అరెస్టు చేసినట్లు చిత్ర కొండ పోలీసులు తెలిపారు. ఒడిస్సా పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... ఆంధ్ర ఒరిస్సా సరిహద్దులో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, అటు నుంచి నలుగురు వ్యక్తులు రెండు ద్విచక్ర వాహనాలపై వస్తుండగా నిలుపుదల చేసి తనిఖీ చేశారు. అనుమానం వచ్చి నలుగురు యువకుల్ని రెండు ద్విచక్ర వాహనాల్ని పోలీస్ స్టేషన్ తరలించారు. అనంతరం వారిని విచారించగా, బైకులు చోరీలకు పాల్పడుతున్నామని, మరొక రెండు మోటారు బైకులు వేరొక చోట దాచి ఉంచినట్లు నిందితులు వెల్లడించారు. నిందితులు దాచి ఉంచిన రెండు బైకులను కూడా పోలీసులు స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కి తరలించారు. ఆంధ్రాలో చోరీ చేసిన బైక్‌లను ఒరిస్సాలోనూ, ఒరిస్సాలో దొంగలించి బైక్‌లను ఆంధ్రలోనూ విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ క్రమంలోనే రెండు బైకులు చిత్రకొండలో బుధవారం విక్రయించేందుకు వస్తున్నట్లు నిందితులు పోలీసు విచారణలో అంగీకరించారు. నిందితులైన తూర్పుగోదావరి జిల్లా తణుకు గ్రామానికి చెందిన పి.శివకుమార్, అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన కోడా సురేష్ బాబు, తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి వన్ పోలీస్ స్టేషన్ పరిధి కోటపేట గ్రామానికి చెందిన ఎ.హరిసూర్య, శ్రీకాకుళం జిల్లా జలుమూరు పోలీస్ స్టేషన్ పరిధి అందవరపు ప్రసాద్‌లపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. బైక్‌ల చోరీపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని ఒరిస్సా పోలీసులు వెల్లడించారు.

మేడ మెట్ల నుండి జారిపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మేడ మెట్లు ఎక్కుతూ ప్రమాదవశాత్తు జారిపడిన వ్యక్తి బుధవారం కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో మృతి చెందారు. జడ్డంగి ఎస్ఐ రఘునాథరావు తెలిపిన వివరాలు ప్రకారం... కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం రమణయ్యపేట గ్రామానికి చెందిన బేలెం రమేష్ (25) మండలంలోని వాతంగి గ్రామానికి పెళ్లి నిమిత్తం స్నేహితులతో వచ్చారు. పెళ్లి అనంతరం నిద్రించడానికి డాబా పైకి వెళ్లే ప్రయత్నంలో కాలుజారీ మెట్టమీద నుండి కింద పడడంతో తలకు బలమైన గాయమైంది. వెంటనే రమేష్‌ను వైద్యం నిమిత్తం మంగళవారం బంధువులు కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి మృతి చెందారు. మృతుని భార్య వంతు జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జడ్డంగి ఎస్ఐ రఘునాథరావు తెలిపారు.

పంప్డ స్టోరేజ్ ప్రాజెక్టు బాధితులకు అన్యాయం జరిగితే సహించం

ప్రజాశక్తి - సీలేరు : గూడెం కొత్త వీధి మండలం సీలేరులో నూతనంగా నిర్మించబోవు పంప్డ స్టోరేజ్ ప్రాజెక్టు వలన సీలేరు పరిసర ప్రాంతాల ప్రజలకు అన్యాయం జరిగినా, ఇబ్బందులకు గురిచేసిన సహించేది లేదని కాంగ్రెస్ పార్టీ అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్షులు వంతల సుబ్బారావు బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. చింతపల్లి మండలం ఎర్రవరం హైడ్రో ప్రాజెక్టు పరిస్థితి సీలేరు పంపు స్టోరేజ్ ప్రాజెక్టుకు రాకుండా చూసుకోవలసిన బాధ్యత ఏపీ జెన్కో ఉన్నత అధికారులపై ఉందని గుర్తు చేశారు. ఇటీవల కొందరు జెన్కో అధికారులు పంపు స్టోరేజ్ ప్రాజెక్ట్ పేరు చెప్పి సీలేరులో ప్రజలను భయభ్రాంతులకు గురి చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని, అదే జరిగితే బాధితులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. పంపు స్టోరేజ్ ప్రాజెక్టు విషయంపై ఇప్పటికే ఎపిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిల దృష్టిలో ఉందని, సందర్భానుకూలంగా ప్రజల సమస్యలపై ఆమె స్పందిస్తారని చెప్పారు. ఇప్పటికైనా ఏపీ జెన్కో ఉన్నతాధికారులు స్పందించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని, లేకుంటే ప్రజల నుండి ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు.